క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మినీమైక్‌సెట్‌ను అందజేస్తున్న దృశ్యం

కవిటి: కుసుంపురం పాఠశాలకు గ్రామస్తులు విరాళాన్ని అందజేశారు. 14,700 రూపాయలతో మినీమైక్‌సెట్‌ను సమకూర్చారని హెచ్‌ఎం శమళ్ల రాజబాబు సోమవారం చెప్పారు. ఈ మొత్తాన్ని గ్రామానికి చెందిన దానయ్య, రాజారావు, ఢిల్లేశ్వరరావు తదితరులు సమకూర్చినట్టు పేర్కొన్నారు. వితరణగా అందించారు.

పోలారావు సేవలు శ్లాఘనీయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణాభివృద్ధితో పాటు స్థానికంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మున్సిపల్ మాజీ చైర్మన్ స్వర్గీయ పిలక పోలారావు చేసిన సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. బెల్లుపడ గ్రామంలో పోలారావు 70వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలోని బేతాళ యువజన సంఘం 24వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎంట్రీలు కోరుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే క్విజ్ పోటీలకు 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. పాల్గొనే జట్లు తమ ఎంట్రీలను ఈనెల 25వ తేదీ నాటికి పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 90000 45663, 93985 33123 నంబర్లను సంప్రదించాలని కోరారు.


10కే రేస్ వాకింగ్‌లో శృతికి ప్రథమస్థానం



బహుమతి అందుకుంటున్న శృతి

కవిటి: గుంటూరు జిల్లా బాపట్లలో మూడు రోజులు నిర్వహించిన 36వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కవిటి మండలం పెద్దమెళియాపుట్టుగకు చెందిన మొగిలిపురి శృతి ప్రథమస్థానం సాధించింది. ఈ మేరకు నిర్వాహకులు శృతికి ప్రశంసాపత్రం, మెమెంటోను బహూకరించారు. స్వతహాగా రోలర్ స్కేటింగ్‌లో జాతీయస్థాయి నైపుణ్యం కలిగిన శృతి వాకింగ్ రేస్‌లో కూడా అద్భుత సాధనతో రాష్ట్రస్థాయిలో రాణించడంపై మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



పూర్ణిమ, భవానీలను అభినందిస్తున్న సిబ్బంది

మందస: గుంటూరు జిల్లా చీరాల, పశ్చిమ గోదావరి జిల్లా చగల్లులో జరిగిన 36వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్-2025లో మందస కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. టెన్త్ విద్యార్థిని ఎ.పూర్ణిమ జావెలెన్‌త్రో విభాగంలో స్వర్ణ పతాకాన్ని సాధించగా, మరో టెన్త్ విద్యార్థిని బి.భవానీ టార్గెట్ బాల్ మిక్సిడ్ విభాగంలో కాంస్య పతాకాన్ని సాధించి సత్తాచాటారు. వీరికి పీఈటీ జి.సంతోషి శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థినులు పూర్ణిమ, భవానీలను ప్రిన్సిపాల్ ఆర్.వాసంతి, సిబ్బంది అభినందించారు.

మాజీమంత్రి పరామర్శ



కిశోర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: చినంచల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాట్నూరు కిశోర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం చినంచల గ్రామానికి వెళ్లి కిశోర్‌ను పరామర్శించి యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో పార్టీ నాయకుడు ఉంగ సాయిక్రిష్ణ, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, చినంచల ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు, కంచరాన భాస్కరరావు, దువ్వాడ రవి, శిష్టు గోపి, బడగల బల్లయ్య, చింతాడ మాధవరావు, పాట్నూరు జోగారావు, పినకాన ముకుంద, దానయ్య ఉన్నారు. మున్సిపాలిటీలోని 20వ వార్డు శివాజీనగర్‌కు చెందిన దుంప ప్రసాద్ ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబాన్ని మాజీ మంత్రి అప్పలరాజు పరామర్శించారు. వార్డు కౌన్సిలర్ అంబటి ఆనందరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు శిష్టు గోపి ఉన్నారు.

కాలువలు ఇలా.. మురుగు పారేదెలా?

- కాలువల్లో పేరుకుపోయిన చెత్త
- ప్రబలుతున్న దోమలు
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి



బెల్లుపడ కాలనీలో పూడికతో నిండిన కాలువ

శాంతినికేతన్ పాఠశాల వీధిలో నిర్వాహణ సక్రమంగా లేని కాలువ



కాలువలు లేక కొండపోలమ్మ కాలనీలో రోడ్డుపైకి విడిచిపెట్టిన మురుగునీరు



స్వేచ్ఛావతినగర్‌లో నిలిచిపోయిన మురుగునీరు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం క్షీణిస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తీయకపోవడంతో పరిస్థితి అధ్వానంగా ఉందని చెబుతున్నారు. మున్సిపాలిటీలోని 23 వార్డుల్లోని చాలా ప్రాంతాల్లో కాలువలు అధ్వానంగా మారాయి. కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో ఎక్కడికక్కడే మురుగునీరు స్తంభించుకుపోతుంది. దీంతో దుర్వాసనతోపాటు దోమల బెడద ఎక్కువగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఒకటి, రెండు వార్డుల పరిధిలోని పురుషోత్తపురం కాలనీ, మూడో వార్డులోని ఏఎస్‌పేట కాలనీ, నాలుగు, ఐదు, ఆరు వార్డుల పరిధిలోని కంద్రవీధి, కృష్ణానగర్, స్వేచ్ఛానగర్, గిలీయివీధి, 11, 12, 13 వార్డుల్లోని నీలకంఠేశ్వరవీధి, నీలావువీధి, బెల్లుపడ అచ్చంపేట, 14, 15, 16, 17 వార్డుల్లోని దానంపేట, సంతపేట శివారుప్రాంతం, 18, 19, 20 వార్డుల్లోని రత్తకన్న, కొండపోలమ్మ కాలనీ, శివారు ప్రాంతాలు, 21, 22 వార్డుల్లోని గొల్లవీధి, బలరామపేట, వీకేపేట, శాంతినికేతన్ పాఠశాల వీధి, 23వ వాడ్డు బెల్లుపడ కాలనీలోని కొంతప్రాంతంలో కాలువల నిర్వాహణ సక్రమంగా లేదు. పట్టణంలోని ప్రధాన కాలువల మినహా చాలా వీధుల్లోని చిన్న కాలువలు, వాటిని ఆనుకొని ఉండే రోడ్లు సక్రమంగా ఉండడంలేదు. ప్రధాన కాలువలో నిండిపోయిన పూడికను మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అప్పుడప్పుడు తొలగిస్తున్నారు. చిన్న, ప్రధాన మురుగు కాలువలకు అనుసంధానమైన కాలువల్లోకి ఇళ్ల నుంచి వ్యర్థాలను విడిచిపెడుతుండడంతో అందులో మురుగు నీరు పారడం కష్టతరంగా తయారైంది. దీంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వర్షాలు కురుస్తున్నప్పుడు కాలువల్లో పేరుకుపోయిన పూడిక కారణంగా నీరు రోడ్లపైకి వచ్చిచేరుతుంది. మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వీధుల్లో కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీటిని రోడ్లపైకి విడిచి పెడుతుండడంతో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయాలని, దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాలువల నిర్వాహణ అంతంత మాత్రమే..



మురుగు కాలువల నిర్వాహణ అంతంత మాత్రంగానే ఉంది. వీధుల్లో కాలువలను శుభ్రం చేయడానికి పారిశుధ్య కార్మికులు ఎప్పుడు వస్తున్నారో ఎవరికి తెలియడంలేదు. శిథిలావస్థకు చేరిన మురుగు కాలువలను బాగు చేయాలి. కాలువల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించేలా మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

–కాళ్ల మదన్‌కుమార్, గొల్లవీధి, ఇచ్ఛాపురం

ప్రజలు సహకరించాలి



కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించాం. పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణకు ఇంటి వద్దకు వచ్చేటప్పుడు ప్రజలు వారికి సహకరించి చెత్తను అందజేయాలి. ఇంటి నుంచి ఉత్పన్న మయ్యే చెత్త చెదారాన్ని కాలువల్లో వేయకుండా ఉంటే కాలువలు శుభ్రంగా ఉంటాయి. ఎక్కడైన మురుగు నీరు నిల్వ ఉన్నట్లు గుర్తిస్తే ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ కూడా చేయిస్తున్నాము.

–ఎన్.రమేష్, మున్సిపల్ కమిషనర్

సామాజిక మండపం ప్రారంభం



కవిటి మండలం డిగొనపపుట్టుగ గ్రామంలోని రామాలయం ఆవరణలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన సామాజిక మండపాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కె.పద్మ సోమవారం ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి మండలపరిషత్ నిధులు సద్వినియోగం చేయడం అభినందనీయమని నాయకులు అన్నారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడుగా ఈ దఫా తనకు కేటాయించిన రూ. 2 లక్షల నిధులను వినియోగించి మండపం నిర్మాణ పనులు చేపట్టినట్టు చందాన పూర్ణచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం కిరణకుమారి, నాయకులు కె.ప్రకాష్, బెందాళం జయప్రకాష్, జల్లు యుగంధర్, వై సీలయ్య, మోహన్‌సాహూ, పి.శేఖర్, డి.ధర్మ పాల్గొన్నారు.

–కవిటి

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



టెక్కలి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను సోమవారం నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. అధ్యక్షునిగా ఆర్.రామచంద్రరావు, సహాధ్యక్షునిగా ఆర్.ప్రసన్నయ్య, కార్యదర్శిగా కె.ధనుంజయరావు, కోశాధికారిగా బి.అయ్యబాబు, గౌరవ అధ్యక్షునిగా ఎం.లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారుడుగా జీ.వి.రెడ్డి మాస్టార్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా బాక సూర్యకళ రూ. 10 వేలు, పేడాడ రమణకుమారి రెండు వేల రూపాయలను అసోసియేషన్ కోసం సాయం అందజేశారు.

–టెక్కలి

కూటమి పాలన మోసాల మయం



కవిటి: డిగొనపపుట్టుగలో క్యూఆర్‌కోడ్ పత్రాలను చూపిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, నాయకులు



ఇచ్ఛాపురం: బెల్లుపడ గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప



సోంపేట: ఉప్పలాంలో మాట్లాడుతున్న సర్పంచ్ బట్టి మాధవరావు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలన మోసాల మయంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు..అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న విషయాన్ని గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. చంద్రబాబు మోసాలతో కూడిన క్యూఆర్ కోడ్ పత్రాలను పంపిణీ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

అన్న క్యాంటీన్ నిర్మాణంపై ఫిర్యాదు



అధికారులకు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: టెక్కలిలో రాజులకు గుర్తుగా ఉన్న పట్టు మహదేవి కోనేరు గట్టుపై నిబంధనలకు విరుద్ధంగా, టీడీపీకి లబ్ధి కలిగేలా, సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ చేపడుతున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను తక్షణమే ఆపాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, ఉపాధ్యక్షుడు పీత రమణబాబు ఆధ్వర్యంలో పార్టీ సమాచార హక్కు చట్టం ప్రతినిధులు దాడి ధర్మారావు, బి.రాజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్నిక జీవన్, జనరల్ సెక్రటరీ సంపతిరావు ఉమాపతి తదితరులు టెక్కలి ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి హైమావతికి ఫిర్యాదు అందజేశారు. చెరువు గర్భాల్లో ఎటువంటి కట్టడాలు చేయకూడదని ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ టీడీపీకి లబ్ధి కలిగే విధంగా రాజకీయ కోణంలో అన్న క్యాంటీన్ నిర్మాణాన్ని చేస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా టెక్కలి రాజులకు గుర్తుగా ఉన్నటువంటి కోనేరు చరిత్రను కాలరాస్తూ టీడీపీ సొంత ప్రయోజనాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న అక్రమ కట్టడాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సంబంధించిన జీవో కాపీలను అధికారులకు అందజేశారు.

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యం



కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం

కంచిలి: సేంద్రియ సాగు పద్ధతిలో ఉత్పత్తి చేసిన కూరగాయలను తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ విధానం మండల యాంకర్ టి.శివానందం అన్నారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయం వద్ద సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ప్రతీ సోమ, బుధవారాల్లో ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేసి సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

ఎక్కువ కేసులు పరిష్కారం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌బాబు

సోంపేట: వచ్చేనెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేవిధంగా కృషిచేయాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు కోరారు. సోంపేట కోర్టుల సముదాయంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసు అధికారులతో లోక్‌అదాలత్‌పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదాలత్ లక్ష్యం, రాజీ చేసుకోవడం వలన ఇరువర్గాలకు చేకూరే ప్రయోజనాలను కక్షిదారులకు తెలియజేయాలన్నారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శైలేంద్ర, కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సోంపేట సీఐ బి.మంగరాజు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పలాస : పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డు పోతనపల్లి వారి వీధిలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పరిసరాల్లో మురుగునీరు చేరడంతో దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రంలో సమర్పించిన వారిలో తూముల సునీల్‌కుమార్, హెచ్.క్రిష్టారావు, కామరాజు, కె.జగదీష్, రాజేష్ ఉన్నారు.

రాహుల్‌గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

కంచిలి: ఓటు దోపిడీపై నిలదీసేందుకు ఢిల్లీలోని ఈసీ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ అన్నారు. అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సంఘటనతో ఓటు దోపిడీ నిజమని దేశ ప్రజలందరికీ తెలిసిందన్నారు.

భద్రత కరువు..!

- రోడ్లపై కానరాని హెచ్చరిక బోర్డులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు




గడిమెట్ట జగన్నాథపురం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

భీంపురం గిరిజన గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదాలు ఇటీవల బాగా పెరిగాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు సంభవిస్తూ పలువురు ప్రాణాలు కోల్పోతుండగా..మరికొందరు గాయపడుతున్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆర్టీవో, పోలీసు, మరికొన్ని శాఖల అధికారులు ఏటా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. అయినప్పటికీ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటున్నాయి. వీటికి ప్రధాన కారణం రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, జంక్షన్లు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మలుపులు, జంక్షన్‌లు, స్కూళ్లు, కళాశాల జోన్లు, ఇరుకైన బ్రిడ్జిలు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు లేకపోవడం.. కొన్నిచోట్ల ఉన్నా అవి వాహనదారులకు కనిపించనంతగా ఉండడంతో వీటిని ఎవరూ గమనించడం లేదు. అలాగే చాలా చోట్ల రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవారు ప్రయాణించేటప్పుడు మలుపులు వద్ద ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన జాతీయ రహదారుల విభాగం అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు. టెక్కలి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను కూడా సంబంధిత అధికారులు పెట్టలేదు.


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇతర ప్రాంతాల నుంచి అతివేగంగా వచ్చే వాహనదారులకు ప్రమాదకరంగా ఉన్న మలుపులను గుర్తించకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా స్కూళ్లు, కాళాశాలు, ఆస్పత్రి ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

–నౌగాపు దామోదర్‌రావు
నీలాపురం గ్రామం, టెక్కలి మండలం

వాహనం తియ్యాలంటే భయమే..



చాలామంది మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ చుట్టుపక్కల వారిని భయాదోళనకు గురిచేస్తున్నారు. నిత్యం పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రజల్లో మాత్రం ఎటువంటి మార్పులు రావడంలేదు. అతివేగంగా వెళ్లడం వలన చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై పూర్తిస్థాయిలో వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించాలి.

– శ్రీనివాసరావు గూడెం గ్రామం, టెక్కలి మండలం

పబ్లిక్ నోటీస్

శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, వెంకటాపురం గ్రామ కాపురస్తురాలు నీలాపు లేటు మల్లేసు గారి భార్య నీలాపు నాగమ్మ గారు ఇచ్చిన భోగట్టాపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా!
నా క్లయింట్ పైన నీలాపు క్రిష్టారావు, గాలి కాంతమ్మ, నీలాపు ప్రకాషరావులపై గిన్ని భానుమతి OS 74/2022 పార్టీషన్ దావా పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వేసియున్నారు. సదరు పైన తెలిపిన దావా షెడ్యూలు ఆస్తులు వజ్రపుకొత్తూరు మండలం, వెంకటాపురం గ్రామంలో కలవు. సదరు దావా కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా దావా ఆస్తులపై ఉభయవాదులు అనగా వాది గిన్ని భానుమతి W/o గణపతిరావు, నీలాపు నాగమ్మ W/o (లేటు) మల్లేసు (నా క్లయింట్), నీలాపు క్రిష్టారావు S/o లేటు కామయ్య, గాలి కాంతమ్మ W/o ఆనందరావు, నీలాపు ప్రకాషరావు S/o లేటు కామయ్య వాది ప్రతివాదులుగా ఉన్నారు. సదరు కోర్టులో ఉన్న ఈ దావా తీర్పు వచ్చేవరకు ఎవ్వరు ఏవిధమైన అగ్రిమెంట్లు గాని, తనఖా గాని, అమ్మకాలు గాని జరిపినచో అవి పద్ధతి ప్రకారం చెల్లనేరవు మరియు నా క్లయింటు నాగమ్మకు బైండింగ్ చేయవు.
షెడ్యూలు ఆస్తులు: శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, వెంకటాపురం చెక్‌బందీలో కలవు. ఆస్తుల వివరాలు 86/1లో 0.8 సెంట్లు మెట్టు భూమి, 84/3లో 0.14 సెంట్లు మెట్టు భూమి, 135/22లో 0.25 సెంట్లు మెట్టు భూమి, 135/21లో 0.18 సెంట్లు మెట్టు భూమి, 135/18లో 0.19 సెంట్లు మెట్టు భూమి, 135/17లో 0.32 సెంట్లు మెట్టు భూమి, 135/16లో 0.56 సెంట్లు మెట్టు భూమి వెరశి ఎకరా 1.72 సెంట్లు ఆస్తులు.
పి.జి.రాజారత్నం, B.A., B.L, న్యాయవాది,
ఓంశాంతినగర్, కాశీబుగ్గ, సెల్: 9985827526